సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 20 । జనవరి । 2023



సిరులతల్లి సన్నిధిలో జయప్రద
డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మిని సినీనటి జయప్రద గురువారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అర్చకులు అందజేశారు.



పడుతూ లేస్తూ.. పరుగులు పెడుతూ..
రైల్వే అధికారులు చివరి నిమిషంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో రత్నాచల్ ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. 8లో



విశాఖలో అల్లు అర్జున్
గోపాలపట్నం : పుష్ప–2 సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సినీ హీరో అల్లు అర్జున్ గురువారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు.

నగర సుందరీకరణ నిరంతర ప్రక్రియ

- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి
- కలెక్టర్‌తో కలిసి కైలాసగిరి సందర్శన
- జీ–20 సదస్సు, గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



తెలుగు మ్యూజియంలో రాజులు, కవుల విగ్రహాలను తిలకిస్తున్న సుబ్బారెడ్డి, అధికారులు



కైలాసగిరి కొండపై మైదాన ప్రాంతం పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తదితరులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలసి గురువారం ఆయన కైలాసగిరిని సందర్శించారు. కొండపై ముఖద్వారం, సర్క్యూట్ రైల్ స్టేషన్, శంకుచక్రం, శివపార్వతుల విగ్రహాలు, రాతి విగ్రహాల పార్కు, పిల్లల ఆట స్థలాలు, తెలుగు మ్యూజియంతో పాటు బీచ్‌రోడ్డు వైపు ఉన్న వ్యూ పాయింట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ పర్యాటక ప్రాంతాలున్న సుందరమైన నగరమన్నారు. పర్యాటకులకు మరింత ఆకట్టుకునే విధంగా నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి కృషి జరుగుతోందన్నారు. కొద్ది రోజుల్లో విశాఖలో గ్లోబల్ సమ్మిట్, జీ–20 సదస్సు జరగనుందని.. ఈ కార్యక్రమాల కోసం వివిధ దేశాల నుంచి 150 మంది ప్రతినిధులు ఇక్కడకు వస్తున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో విదేశీ అతిథులకు ఇక్కడి అందాలు ఆకర్షించేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కైలాసగిరి, ఆర్.కె. బీచ్, రుషికొండ బీచ్‌లతో పాటు ఆర్‌కే బీచ్ నుంచి రుషికొండ వరకు 12 కిలోమీటర్ల మేర బీచ్‌రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

సముద్ర తీరంలో వీధి దీపాల ఏర్పాటుతో పాటు పర్యాటకులకు తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సదస్సులనే కాకుండా నగర సుందరీకరణ ప్రక్రియ నిరంతరం సాగుతుందన్నారు. తీరప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా.. ఆర్.కె బీచ్, రుషికొండ బీచ్ తదితర బీచ్‌ల్లో 38 మంది గజ ఈతగాళ్లను నియమించినట్లు వెల్లడించారు. కైలాసగిరి, బీచ్‌లలో పర్యాటకులకు వసతి గృహాలు ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. నగరంలో 215 పార్కులు ఉండగా.. మొదటి ఫేజ్‌లో 39 పార్కుల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. రెండో విడతలో మరో 45 పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. నగర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ప్రజలతో పాటు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. కైలాసగిరి కొండ దిగువన ఆక్రమణకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. వాటిని వెంటనే తొలగించాలని కలెక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, వీఎంఆర్డీఏ డీఎఫ్‌వో శాంతి స్వరూప్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

- అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో డీటీసీ రాజారత్నం, ఇతర అధికారులు

సాక్షి, విశాఖపట్నం: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. కమిటీ అధ్యక్షుడు కలెక్టర్ డా.మల్లికార్జున సమీక్ష చేస్తూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. సింహాచలం వద్ద బీఆర్టీఎస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై మొక్కల ట్రిమ్మింగ్ పనులు ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ పనులు పూర్తి చేయాలని పోలీస్ అధికారులను, ఆర్టీసీ డ్రైవర్లకు భద్రతా పరమైన శిక్షణ కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని, అవసరమైన చోట స్థలాలు గుర్తించి బస్‌షెల్టర్లను నిర్మించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా పెద్ద సైజులో సూచిక బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్స్, రంబుల్ స్ట్రిప్పులు ఏర్పాటుచేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లు, వినియోగంలో లేని సిగ్నల్ లైట్లు, వైర్లు తొలగించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ రాజారత్నం, ఏసీపీ శరత్ కుమార్, జీవీఎంసీ ఎస్ఈ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ పాల్గొన్నారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై స్పీడ్ బ్రేకర్లు

తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై ఇటీవల రెండు రోజుల వ్యవధిలో నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. ఫ్లైఓవర్‌పై ఓవర్ స్పీడ్‌తో వెహికల్స్ వెళ్లడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని రోడ్ సేఫ్టీ కమిటీ అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై నుంచి ద్విచక్ర వాహనాల రాకపోకల నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ కింద రోటరీలో మాత్రమే ద్విచక్ర వాహనచోదకులు ప్రయాణం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్థలాల్లో రోడ్డు భద్రతా పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రూ.30కోట్లతో రహదారి భద్రత

ఆర్ అండ్ బీ, జీవీఎంసీ, డీటీసీ, రెవెన్యూ విభాగాల అధికారుల సంయుక్త పర్యవేక్షణలో గుర్తించిన లోపాలకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ఇప్పటివరకు గుర్తించిన లోపాలను పూడ్చేందుకు దాదాపు రూ.32 కోట్లు కేటాయించింది. నగరంలో పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు జగదాంబ జంక్షన్‌లో రూ.11.4కోట్లతో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్ పూర్తయింది. రూ.8 కోట్లతో రోడ్ల గుంతలు, మరమ్మతులు పూర్తయ్యాయి. జంక్షన్ల అభివృద్ధికి రూ. 5.7 కోట్లు, స్పీడ్ బ్రేకర్స్, రోడ్ మార్కింగ్‌ల కోసం రూ. 1.17కోట్లు, అండర్ పాస్ మెరుగుదలకు రూ. 42.5లక్షలు, మీడియన్ గ్రిల్స్ కోసం రూ.1.38 కోట్లు, రహదారుల వెంబడి లైటింగ్ కోసం రూ.54 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా.. ఇప్పటివరకు వివిధ పనుల కోసం రూ.21 కోట్లు ఖర్చు చేశారు. మరో 7 కోట్లతో పనులు జరుగుతుండగా.. రూ.4 కోట్ల పనులు టెండరు దశలో ఉన్నాయి. మింది జంక్షన్ వద్ద రోడ్డు వెడల్పు పనులు చేపట్టనున్నారు. జిల్లాలో గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్ కింద 8770 కేసులు నమోదు చేయగా.. వీరిలో 142 మందికి జైలు, 1407 మంది కమ్యూనిటీ సేవల విధులు నిర్వర్తించేలా శిక్షలు విధించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి ఆదుకునే వారికి రూ.5వేల చొప్పున పారితోషికాన్ని అందించే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కమిటీ నిర్ణయించింది.

న్యూస్‌రీల్

స్టాఫ్ నర్సుల ఎంపికకు నేడు మళ్లీ కౌన్సెలింగ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): తప్పులు తడకలతో నిండిన స్టాఫ్ నర్సుల పోస్టుల జాబితాను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పునఃపరిశీలన చేసి.. తుది జాబితాను సిద్ధం చేశారు. రాష్ట్ర స్థాయి అధికారుల సమక్షంలో శుక్రవారం అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ పూర్తి చేసి.. అక్కడికక్కడే పోస్టింగ్ ఆర్డర్ అందజేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఉమా సుందరి తెలిపారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల అభ్యర్థుల కోసం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 17న నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఎంపిక జాబితాపై నిరుద్యోగ అభ్యర్థులు, తాత్కాలిక ఉద్యోగ నర్సులు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే..

ఇద్దరు సీఐలకు పోస్టింగ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): సిటీ వీఆర్‌లో ఉన్న ఇద్దరు సీఐలకు పోస్టింగ్ ఇస్తూ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎ.వి.లీలారావును ఎయిర్‌పోర్ట్ ప్రొటోకాల్ ఆఫీసర్‌గా , టి.ఇమ్మాన్యుయల్ రాజును ద్వారకా సబ్ డివిజన్ క్రైం సీఐగా నియమించారు.

నేటి నుంచి ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో



వివరాలు వెల్లడిస్తున్న వాసీవా అధ్యక్షుడు బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వాసీవా) భవనం ఆవరణలో శుక్రవారం ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో–2023 ప్రారంభం కానుందని అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ తెలిపారు. వాసీవా భవనంలో గురువారం ఆయన మాట్లాడారు. రెండు రోజుల పాటు జరగనున్న ఎక్స్‌పోలో స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్ ఇండియా, రైల్వే, హెచ్ఎస్ఎల్, ఎన్ఏఎల్, నెల్‌కో, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ద్వారా వ్యాపార అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కలుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి ఏడీ జీ.వి.ఆర్. నాయుడు మాట్లాడుతూ ఎక్స్‌పోలో 70 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాసీవా ఉపాధ్యక్షుడు ఈ.కృష్ణ ప్రసాద్, కార్యదర్శి డి.వినోద్, కోశాధికారి బి.ఎస్.రావు పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత 'గుండె' శస్త్రచికిత్సలు



కలెక్టర్ మల్లికార్జునకు ఒప్పందపత్రం అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పుట్టుకతో వచ్చే గుండె వ్యాధుల గల పిల్లలకు ఉచితంగా శస్త్రచికిత్సలు అందించే ప్రక్రియకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, సాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్(ఎంవీపీ కాలనీ), రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) మధ్య గురువారం ఒప్పందం జరిగింది. ఈ ఒప్పంద పత్రాలను డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.సమత కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు. కేజీహెచ్‌లోని డీఈఐసీ ద్వారా గుర్తించిన కేసులను సాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్‌కు రిఫర్ చేస్తారు. అక్కడ గుండె వైద్య నిపుణులు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సిద్ధిపేట(రాయ్‌పూర్)లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లాలో పలు వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టు(నెలకు రూ.56,250), ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ పోస్టు(నెలకు రూ.72వేలు), సీనియర్ టీబీ సూపర్‌వైజర్ పోస్టు(నెలకు రూ.33,975) భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కాంట్రాక్టు పద్ధతిపై రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో పోస్టులు భర్తీ చేస్తామన్నారు. https://visakhapatnam.ap.gov.in/ను సందర్శించి అర్హతలు తెలుసుకుని, దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

త్వరలో సైబర్ వారియర్స్

- సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ సరికొత్త ప్రయోగం
- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సైబర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): లక్కీ డ్రాలో రూ.లక్షలు గెలుచుకున్నారని ఒకరు.. ఆర్డర్ ఇవ్వకపోయినా కొరియర్ వచ్చిందని మరొకరు.. రూ.5 వేలు లోన్ ఇచ్చి.. రూ.50 వేలు కట్టాలని బెదిరిస్తూ ఇంకొకరు.. ఇలా అనేక దారుల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. పెరుగుతున్న సాంకేతికతను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సైబర్ కేటుగాళ్లు రోజుకో కొత్త పంథాలో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. రోజు రోజుకూ సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుండడంతో వాటి నియంత్రణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుంటున్న బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వీలైనంత వేగంగా వారికి న్యాయం చేసేందుకు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం సైబర్ వారియర్స్ పేరుతో సైబర్ నేరాల నియంత్రణకు కొంత మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ నిర్ణయించారు.

ప్రతి స్టేషన్‌లో సైబర్ హెల్ప్ డెస్క్

ఏటా సైబర్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2021లో 316 సైబర్ కేసులలో బాధితులు రూ.9.32 కోట్లు పోగొట్టుకున్నారు. ఇందులో రూ.1.46 లక్షలు మాత్రమే బాధితులకు అందించగలిగారు. 2022లో 610 కేసుల్లో సైబర్ నేరగాళ్లు రూ.16.33 కోట్లు బాధితుల నుంచి కొల్లగొట్టారు. ఇందులో రూ.37.55 లక్షలు పోలీసులు రికవరీ చేశారు. ఈ సైబర్ కేసుల దర్యాప్తులో అనేక ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఇవి పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. ఏటా సైబర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ విశాఖలో ఒక సైబర్ క్రైం స్టేషన్ మాత్రమే ఉంది. దీంతో బాధితులు అందరూ అక్కడకు వెళ్లి ఫిర్యాదులు చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన సీపీ శ్రీకాంత్ ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కూడా సైబర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో కొంత మంది సిబ్బందిని సైబర్ వారియర్స్ పేరుతో నియమించనున్నారు. వీరికి సైబర్ నేరాల తీరుపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. వీరు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు సత్వరం స్పందించే విధంగా తర్ఫీదు ఇవ్వనున్నారు. దీనిపై సీపీ గురువారం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సైబర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు, సైబర్ వారియర్స్ నియామకం, వారి శిక్షణ వంటి అంశాలపై అధికారులు పలు సూచనలు చేశారు. త్వరలోనే సైబర్ వారియర్స్‌గా కొంత మందిని గుర్తించి, వారిని నియమించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుళ్ల రాత పరీక్షకు నిమిషం నిబంధన


- 22న రాత పరీక్షకు హాజరుకానున్న 54,772 మంది అభ్యర్థులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కానిస్టేబుళ్ల నియామక రాత పరీక్షకు పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో 97 పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు 41,435 మంది పురుష అభ్యర్థులు, 13,338 మంది మహిళా అభ్యర్థులు మొత్తంగా 54,772 మంది హాజరుకానున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ పలు సూచనలు చేశారు.

- అభ్యర్థులు నిర్ణీత సమయానికి ఒక గంట ముందుగా పరీక్ష హాలుకు హాజరు కావాలి.
- హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలి.
- పరీక్షకు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్ మాత్రమే వినియోగించాలి.
- నిర్ణీత సమయానికి ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎల్రక్టానిక్ పరికరాలు(సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్‌లు, బ్యాగులు) అనుమతించరు.
- అభ్యర్థులకు వారి వెంట తెచ్చుకొనే విలువైన వస్తువులను వారే భద్రపరుచుకోవాలి.
- కేంద్రాల వద్ద పరీక్ష జరిగే సమయంలో జిరాక్స్ షాపులు, ఫొటో స్టూడియోలు మూసివేయాలి.
- పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది.

కుమార్తెలను చంపి తండ్రి ఆత్మహత్య?

ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దారుణం



కుమార్తెలు మాధవి, భార్గవితో దుర్గా ఆంజనేయప్రసాద్ (ఫైల్)



బాలికల మృతదేహాలు



ఉరి వేసుకున్న ఆంజనేయప్రసాద్

మర్రిపాలెం(విశాఖ ఉత్తర): ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని ఛిద్రం చేశాయి. ఇద్దరు కుమార్తెలను విగత జీవులుగా చేసి.. తండ్రి బలవన్మరణానికి కారణమయ్యాయి. కంచరపాలెంలో తండ్రి, ఇద్దరు కుమార్తెలు అనుమానాస్పద మృతి స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత రామారావు ఆస్పత్రి సమీపంలో గంగన్ననగర్ ప్రాంతంలో పిల్లా దుర్గా ఆంజనేయ ప్రసాద్(40), కుమార్తెలు బిందు మాధవి(14), భార్గవి(13)తో గత ఏడేళ్లుగా అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ప్రసాద్ భార్య నాగమణి 2013లో అనారోగ్యం కారణంగా మృతి చెందింది. గత కొద్ది కాలంగా ప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే గత కొద్ది కాలంలో ఖాళీగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

తల్లి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్..

ప్రసాద్ తల్లి పిల్లా అనసూయ మరోచోట నివాసముంటున్నారు. ఆమె ప్రసాద్‌కు గురువారం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సాయంత్రం కూడా ఫోన్ అవ్వకపోవడంతో ఆమె ఇంటికి వచ్చి తలుపు కొట్టింది. ఎంత సేపు కొట్టినా లోపల నుంచి ఎవరూ రాకపోవడంతో ఆమె 100కు ఫోన్ చేసి సమాచారం అందించింది. వెంటనే కంచరపాలెం పోలీసులు అక్కడకు చేరుకొని ఇంటి కిటికీ పగలగొట్టి లోపలకు వెళ్లారు. ఇంట్లో ఒక గదిలో నేలపై ఇద్దరు కుమార్తెలు విగత జీవులుగా పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మరో గదిలో తండ్రి ప్రసాద్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నాడు. విషయం తెలుసుకున్న డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, సీఐ ఎస్.విజయ్‌కుమార్, ఎస్ఐ రవికిశోర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

స్కూల్‌కు పంపడంలేదు.. అద్దె చెల్లించడం లేదు

తండ్రి, కుమార్తెల అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చుట్టుపక్కల వారి నుంచి కొంత మేర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో సూసైడ్ నోట్ కూడా లేకపోవడంతో అనుమానాస్పద మృతిగానే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొద్ది కాలంగా కుమార్తెలను స్కూల్‌కు పంపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే ఏడు నెలల నుంచి ఇంటి అద్దె కూడా చెల్లించడం లేదని తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులే ఈ బలవన్మరణాలకు కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. తండ్రి ప్రసాద్ తన ఇద్దరి కుమార్తెలను ముందు హత్య చేసి తరువాత తాను ఉరి వేసుకొని ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే కుమార్తెలను ఎలా హతమార్చాడన్న విషయంపై కూడా ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఒక కుమార్తె మెడపై గుర్తులు ఉన్నట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పిల్లలిద్దరూ ఎలా చనిపోయారన్న విషయం తెలుస్తోందని డీసీపీ–2 కె.ఆనందరెడ్డి తెలిపారు.

వినియోగదారుల ప్రయోజనాలే ముఖ్యం

- 2023–24లో విద్యుత్ టారిఫ్‌లలో మార్పులు లేవు
- ప్రారంభమైన ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ
- తొలిరోజున అభిప్రాయాలు తెలిపిన 20 మంది



అభిప్రాయాలు తీసుకుంటున్న ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.రాజగోపాల్ రెడ్డి



తమ ప్రతిపాదనలను వివరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

సాక్షి, విశాఖపట్నం : వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గృహ విద్యుత్ వినియోగదారులపై చార్జీల పెంపునకు డిస్కంలు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ గురువారం నగరంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రారంభమైంది. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి రాజగోపాల్ రెడ్డి అధ్వర్యంలో ప్రారంభమైన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయా డిస్కంల సీఎండీలు తమ ప్రతిపాదనల నివేదికను ఈఆర్సీ ముందుంచారు.

చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడుతూ, విద్యుత్ సంస్థల ఆర్థిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సమతూకం ఉండేలా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయాలను తీసుకొంటుందన్నారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సీనియారిటీ జాబితాను పారదర్శకంగా ఉండేలా డిస్కమ్‌లు తమ వెబ్‌సైట్లలో కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రచురిస్తున్నాయని తెలిపారు. విద్యుత్ ఆదా చేసే పరికరాలను వినియోగించడంలో వినియోగదారుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. బహిరంగ మార్కెట్ తో పోలిస్తే ఇంధన సమర్థవంతమైన లైట్లు, ఎయిర్ కండిషనర్లు, సూపర్ ఎఫిషియంట్ ఫ్యాన్లను తగ్గింపు ధరలకు గృహ విద్యుత్ వినియోగదారులకు ముందస్తు చెల్లింపు ద్వారా లేదా ఆన్–బిల్ ఫైనాన్సింగ్ ఎంపికపై అందించే పైలట్ ప్రాజెక్ట్ ను కమిషన్ ఆమోదించిందని వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. వివిధ కారణాల కారణంగా పారిశ్రామిక యూనిట్లు దీర్ఘకాలంగా మూసివేయబడిన కాలంలో కనీస ఛార్జీల భారాన్ని నివారించేందుకు సిక్ ఇండస్ట్రియల్ పాలసీని పునరుద్ధరించినట్లు వెల్లడించారు. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లను క్రమబద్ధీకరించడానికి, లావాదేవీలలో పారదర్శకతను నిర్ధారించడానికి కమిషన్ ప్రత్యేకంగా 2022 రెగ్యులేషన్ 1ని నోటిఫై చేసిందన్నారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి అందరికి అవకాశం కల్పించడానికి వ్యక్తిగత విచారణలతో పాటు అవసరమైన విషయాలపై బహిరంగ విచారణలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.

డిస్కంల ఆర్థిక పరిస్థితిపై దృష్టి సారించండి..

డిస్కమ్‌లకు రావల్సిన సబ్సిడీలు పూర్తిస్థాయిలో రాకపోవడం కారణంగానే వాటి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటం లేదని వివిధ వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తొలి రోజున 20 మంది తమ అభిప్రాయాలను ఈఆర్సీకి తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులు మన డిమాండ్‌ని తీర్చలేవని డిస్కమ్‌లు అంగీకరించిన నేపథ్యంలో వాటిని ప్రోత్సహించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు విద్యుత్ రంగాన్ని హైజాక్ చేస్తూ నాశనం చేస్తున్నాయనీ.. దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఏపీఈఆర్సీ నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. విజిలెన్స్ వ్యవస్థని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెర్రో అల్లాయిస్ కంపెనీలకు డిమాండ్ చార్జీలు పెంచడం మొదలైన నిర్ణయాలు ఆ రంగాన్ని నిర్వీర్యం చేసేటట్లుగా ఉన్నాయనీ.. డిస్కంలు చేసిన ఈ ప్రతిపాదనని ఆమోదించవద్దని ఫ్యాప్సీ ప్రతినిధులు కోరారు. రైతులకు 9 గంటల విద్యుత్ అని ప్రభుత్వం చెబుతున్నా.. డిస్కంలు మాత్రం వివిధ సాంకేతిక కారణాల పేరుతో కేవలం మూడున్నర గంటలే ఇస్తున్నాయనీ.. దీనిపై దృష్టిసారించాలని కోరారు. నష్టాల విషయంలో ఏపీఈపీడీసీఎల్ తప్పుడు లెక్కలు చెబుతోందని ఆరోపించారు.

మరణించినా.. మరో ముగ్గురి జీవితాలకు వెలుగునిచ్చి..



సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది. (ఇన్‌సెట్‌) లక్ష్మి (ఫైల్‌)

పెదగంట్యాడ: బ్రెయిన్‌ డెడ్‌ అయి, తమ ఇంటి దీపాన్ని కోల్పోయినా ఆ బాధను దిగమింగుకుని.. అవయవ దానానికి అంగీకరించి.. మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపారు ఆ ఇంటి పెద్ద, ఆయన పిల్లలు. వివరాలివి.. జీవీఎంసీ 75వ వార్డు పరిధి శీకువానిపాలేనికి చెందిన శీకు ముసలినాయుడు భార్య లక్ష్మి (40)ని మూడు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా కిమ్స్‌ ఐకాన్‌ ఆస్పత్రిలో జాయిన్‌ చేశారు. చికిత్స పొందుతూ గురువారం బ్రెయిన్‌ డెడ్‌ అయ్యారు. దీంతో ఆసుపత్రి వైద్యులు ఆమె భర్త శీకు ముసలినాయుడుతో, పిల్లలతో మాట్లాడారు. లక్ష్మి బ్రెయిన్‌ డెడ్‌ అయ్యారని, ఆమె అవయవాలు పనిచేస్తాయని తెలిపారు. అందుకు వారు అంగీకరించగా ఆమె గుండె, కళ్లు, కిడ్నీలను దానం చేశారు.

దొంగ ఓట్లకు తెరతీసిన టీడీపీ





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్‌ కోఆర్డినేటర్‌ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌, హాజరైన దక్షిణ నియోజకవర్గ పార్టీ శ్రేణులు

- ప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- దక్షిణ ఎమ్మెల్యేగా వాసుపల్లిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి పిలుపు

సాక్షి, విశాఖపట్నం: ఓటమి భయంతో బూత్‌ స్థాయిలో టీడీపీ సాగిస్తున్న దొంగ ఓట్ల నమోదు కార్యక్రమం పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ చైర్మన్‌, వైఎస్సార్‌ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మద్దిలపాలెం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో దక్షిణ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. నియోజకవర్గంలో గల పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులతో మాట్లాడి.. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పథకాలు అందిస్తున్న వై.ఎస్‌.జగన్‌మోహన్‌ రెడ్డిపై చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మితే రాష్ట్రంలోని కోట్లాది మంది పేదలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి గురించి ఇంటింటికీ తెలియజేయాలన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

వాసుపల్లిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విశాఖ దక్షిణ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీలో అంతర్గత సమస్యలుంటే, ఒక కుటుంబంలో అన్నదమ్ముల్లా నాలుగు గోడల మధ్య చర్చిద్దామని, అందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడానికి పార్టీ కేడర్‌ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను సమావేశంలో పరిచయం చేశారు. ఆయన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌, నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ, తైనాల విజయ్‌కుమార్‌, ఎస్‌ఎ రెహమాన్‌, కోలా గురువులు, కార్పొరేషన్‌ చైర్మన్లు జాన్‌వెస్లీ, మధుసూదన్‌రావు, కార్పొరేటర్లు మహ్మద్‌ సాధిక్‌, కందుల నాగరాజు, ఉరికూటి నారాయణరావు, కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్‌ జైన్‌, తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, మాసిపోగు మేరిజోన్స్‌, చెన్నా జానకీరామ్‌, ఆళ్ల లీలావతి, కోడిగుడ్ల పూర్ణిమ, ముఖ్యనాయకులు కొండా రాజీవ్‌ గాంధీ, గరికిన గౌరి, ద్రోణంరాజు శ్రీవాత్సవ్‌ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత మనదే..
- ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్‌ కోఆర్డినేటర్‌ హర్షవర్ధన్‌ రెడ్డి
- విశాఖ, అల్లూరి జిల్లాల జేసీఎస్‌ మండల కన్వీనర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్‌ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్‌ హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలందించే బాధ్యత మనపైనే ఉందని ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌ సీపీ జేసీఎస్‌(జగనన్న సచివాలయం కన్వీనర్స్‌ అండ్‌ గృహ సారథి) కో–ఆర్డినేటర్‌ హర్షవర్ధన్‌ రెడ్డి అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌ సీపీ విశాఖ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జేసీఎస్‌ మండల కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై.. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఈ ముష్కరుల ముప్పేటదాడిని తిప్పికొట్టడంతో పాటు వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్త భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరవేసేలా.. గ్రామ సారథులు, కన్వీనర్ల నియామకానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలతో మరింత మమేకమయ్యే విధంగా జేసీఎస్‌ కన్వీనర్ల నియామకం జరిగిందన్నారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని కోరారు. కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు కె.కె రాజు, అక్కరమాని విజయనిర్మల, నియోజకవర్గాల పరిశీలకులు ఎస్‌.ఎ.రెహ్మాన్‌, బొడ్డేటి ప్రసాద్‌, చిక్కాల రామారావు, చొక్కాకుల వెంకటరావు, కొండేపల్లి కొండలరావు, కర్రి పాపారాయుడు, ముఖ్య నాయకులు అక్కరమాని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జనం ఇతివృత్తాలే వేమన పద్యాలు



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్‌ హరివెంకటకుమారి, కమిషనర్‌ రాజాబాబు

దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం మహాకవి యోగి వేమన జయంతి వేడుకలు జరిగాయి. మేయర్‌ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్‌ పి.రాజాబాబు, డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్‌, పలువురు అధికారులు వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్‌, కమిషనర్‌ మాట్లాడుతూ పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి, ప్రజలను మెప్పించిన మహాకవి వేమన అన్నారు. జీవితంలో ఎలా ఉండాలి? ఎలా బతకాలి? వంటి గొప్ప విషయాలను మనకు చెప్పిన వేమన ధన్యుడన్నారు. విదేశీయులు సైతం ఆయన శతకాన్ని ఆదరించారని, సీపీ బ్రౌన్‌ వేమన పద్యాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైఎస్సార్‌ సీపీ ఫ్లోర్‌ లీడర్‌ బానాల శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, ఎస్‌ఎస్‌ వర్మ, డాక్టర్‌ వి.సన్యాసిరావు, యూసీడీ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ పాపునాయుడు, ప్రధాన ఇంజినీర్‌ రవికృష్ణరాజు, డీసీఆర్‌ ఫణిరాం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలో తీర్మానాలకు ఆమోదం



తీర్మానాలకు ఆమోదం తెలుపుతున్న రమాదేవి

దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌ కొండా రమాదేవి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. సంస్థ ఆధీనంలో పని చేస్తున్న 13 గ్రంథాలయాల భవనాలకు మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు చేపట్టేందుకు తీర్మానించారు. పరవాడ, ఆనందపురం, పద్మనాభం, పెదగంట్యాడ, కె.కోటపాడు, బుచ్చయ్యపేట, కశింకోట, మునగపాక, చోడవరం, వి.మాడుగుల, కొత్తకోట, పెందుర్తి శాఖా గ్రంథాలయాల నిర్వహణకు సుమారు రూ.4 నుంచి రూ.5 లక్షల ఖర్చు అవుతుందని ఆంధ్రప్రదేశ్‌ విద్యా, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీరింగ్‌ అధికారులు అంచనాను రమాదేవికి అందజేశారు. అనంతరం కమిటీ సభ్యుల సమక్షంలో పలు అంశాలపై చర్చించి తీర్మానం చేసి ఆమోదించారు. 27 గ్రంథాలయాల్లో పాడైన పుస్తకాలు తీసేందుకు సభ్యులు ఆమోదించారు. మహారాణిపేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ నూతన భవన నిర్మాణం రూ.2 కోట్లతో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ఏడీ అరుణ జ్యోతి, వయోజన విద్యా ఉపసంచాలకుడు వర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్లమందు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్‌

దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ): వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి యాసీన్‌ బాబా దర్గా సమీపంలో నల్లమందు(మత్తు మందు) విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి కేజీ నల్లమందు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను వన్‌టౌన్‌ పోలీసులకు అప్పగించారు.

విక్టోరియా ఆస్పత్రిలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో అవుట్‌ సోర్సింగ్‌ పద్ధతిలో నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.ఉషా తెలిపారు. ఈసీజీ టెక్నీషియన్‌ ఒక పోస్టు రోస్టర్‌ పాయింట్‌ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఈనెల 27 లోపు దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు https@//visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

యాత్రి టికెట్‌ సువిధ కేంద్రం ప్రారంభం

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికులకు రైల్వే సేవలను మరింత చేరువ చేసేందుకు రిజర్వ్‌డ్‌, అన్‌ రిజర్వ్‌డ్‌ టికెట్లను విక్రయించే రైల్వే అధీకృత ఏజెంట్‌ యాత్రి టికెట్‌ సువిధ కేంద్ర సేవలను డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌ సత్పతి గురువారం ప్రారంభించారు. అనంతరం మొదటి టికెట్‌ను ప్రయాణికుడికి అందజేశారు. ఈ కేంద్రం ద్వారా రిజర్వ్‌డ్‌ టికెట్లతో పాటు సాధారణ టికెట్లు కూడా తీసుకునే వెసులుబాటు ప్రయాణికుడికి కలుగుతుంది. మహారాణిపేట ప్రాంతంలో ఎనిమిదవ కేంద్రంగా నళిని యాత్రి సువిధ టికెట్‌ కేంద్రను ఏర్పాటుచేశారు. కనీసం రెండేళ్లు అధీకృత ఏజెంట్లుగా పనిచేసిన వారికి ఈ సువిధ కేంద్ర లైసెన్స్‌ రైల్వే పీపీపీ పద్ధతిలో మంజూరుజేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్‌ డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ ఎ.కె.త్రిపాఠి, డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ అవినాష్‌ శర్మ, అసిస్టెంట్‌ కమర్షియల్‌ మేనేజర్‌ సర్కార్‌ పాల్గొన్నారు.

3న వెటరన్‌ సెయిలర్స్‌ ఫోరం సమావేశం

సింథియా(విశాఖ పశ్చిమ): నేవీ వీక్‌ ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 3న ఐఎన్‌ఎస్‌ శాతవాహన సమీపంలో ఉన్న సముద్రిక ఆడిటోరియంలో వెటరన్‌ సెయిలర్స్‌ ఫోరం సర్వసభ్య సమావేశం జరగనుంది. భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించిన వివిధ విధానాలు, నావికులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశాలకు హాజరు కావాలనుకునే సభ్యులు ఫిబ్రవరి ఒకటో తేదీలోపు సింథియా జంక్షన్‌ సమీపంలోని ఐఎన్‌సీఎస్‌ కాంప్లెక్స్‌ సమీపంలో ఉన్న కమాండ్‌ రెజిమెంటల్‌ సిస్టం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0891–2813067 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పల్లెనారాయణపురం హెచ్‌ఎం సస్పెన్షన్‌

- నలుగురు టీచర్లకు షోకాజ్‌ నోటీసులు
- విధి నిర్వహణలో అలసత్వమే కారణం



పల్లెనారాయణపురం పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

సింహాచలం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన జీవీఎంసీ 93వ వార్డు పల్లెనారాయణపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యానందంను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సస్పెండ్‌ చేశారు. పాఠశాలను గురువారం ఆమె సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గమనించారు. హెచ్‌ఎం సత్యానందం తరగతులకు సరిగ్గా వెళ్లకపోవడం, నోట్‌బుక్స్‌, వర్క్‌బుక్‌ కరెక్షన్‌ చేయకపోవడం, రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం, విధులకు గైర్హాజరు కావడం, డీఈవో కార్యాలయం నుంచి వచ్చే సమాచారాన్ని మిగతా టీచర్లకు అందజేయకపోవడం తదితర అంశాలను డీఈవో తన పరిశీలనలో గుర్తించారు. నాడు–నేడు పనులకు సంబంధించి శ్రద్ధ చూపకపోవడం, సిమెంట్‌ బస్తాలు గడ్డ కట్టి ఉండటంతో హెచ్‌ఎం సత్యానందంపై చర్యలు తీసుకున్నారు. 93వ వార్డు పరిధిలోని అప్పన్నపాలెం ప్రాథమిక పాఠశాలను కూడా ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులు వర్క్‌ బుక్‌ కరెక్షన్‌ సరిగ్గా చేయకపోవడాన్ని గుర్తించి.. నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు.

కోస్టల్‌ సెక్యూరిటీ కానిస్టేబుల్‌ ప్రతిభ



కోస్టల్‌ సెక్యూరిటీ ఇన్‌చార్జి అధికారి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న కానిస్టేబుల్‌ వీరేంద్ర

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్‌ కోస్టల్‌ సెక్యూరిటీ పోలీసు విభాగానికి చెందిన కానిస్టేబుల్‌ బి.వీరేంద్ర(పీసీ 3642) శిక్షణలో ప్రతిభ కనబరిచారు. గతేడాది నవంబర్‌ 7 నుంచి ఈ నెల 14వ తేదీ వరకు గుజరాత్‌లో స్విమ్మింగ్‌, బోటు హ్యాండ్లింగ్‌, వెపన్‌ ఫైరింగ్‌, ఇంటర్నేషనల్‌ మారిటైమ్‌, ఫైర్‌ ఫైటింగ్‌, మెరైన్‌ నేవిగేషన్‌ తదితర వాటిలో శిక్షణ తీసుకున్నారు. కేంద్ర హోం శాఖ పరిధిలో ఉండే నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ కోస్టల్‌ పోలిసింగ్‌లో మెరైన్‌ పోలీసు ఫౌండేషన్‌ శిక్షణ ఇస్తోంది. ఈ శిక్షణకు విశాఖ నుంచి కోస్టల్‌ సెక్యూరిటీ పోలీసు విభాగంలో పని చేస్తున్న వీరేంద్ర హాజరై పలు అంశాల్లో అఖిల భారత స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వీరేంద్రకు గురువారం కోస్టల్‌ సెక్యూరిటీ పోలీసు విభాగం ఇన్‌చార్జి అధికారి, డీఐజీ ఎస్‌.హరికృష్ణ జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ ఎస్పీ మధుసూదనరావు, పోర్టు మెరైన్‌ అధికారి జి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రం అందజేస్తున్న కమిషనర్‌ రాజాబాబు

దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ): జీవీఎంసీలో కారుణ్య నియామకాల ద్వారా 14 మందికి గురువారం కమిషనర్‌ పి.రాజాబాబు ఉద్యోగ పత్రాలు అందజేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల పిల్లలకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించామని కమిషనర్‌ తెలిపారు. వీరిలో వర్క్‌ ఇన్‌స్పెక్టర్లుగా నలుగురు, సోషల్‌ వర్కర్‌గా ఒకరు, గ్రేడ్‌ టు ఫిట్టర్‌గా ముగ్గురు, ఆఫీస్‌ సబార్డినేటర్‌గా ఒకరు, మజ్దూర్లుగా ఆరుగురిని నియమించినట్లు చెప్పారు. నియామక పత్రాలు అందుకున్న వారు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన, అధికారుల పట్ల విధేయత, ప్రజలకు మంచి చేయాలనే తపనతో ఉండాలని సూచించారు. అదనపు కమిషనర్‌ వై. శ్రీనివాసరావు, ఏవో(అడ్మిన్‌) పద్మజ, పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పడుతూ లేస్తూ పరుగులు పెడుతూ..

- రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌ ప్లాట్‌ఫాం మార్పు
- పరుగులు పెట్టిన ప్రయాణికులు
- రైల్వే తీరుపై ఆగ్రహం

8వ నంబర్‌ ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు





4వ నంబర్‌ ప్లాట్‌ఫాంనకు మారడంతో పరుగులు









ప్రతి రోజూ 8వ నంబర్‌ ప్లాట్‌ ఫాంకు వచ్చే రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌.. గురువారం ఆఖరి నిమిషంలో 4వ నంబర్‌ ప్లాట్‌ ఫాంకు వస్తుందని అనౌన్స్‌మెంట్‌ ఇవ్వడంతో ప్రయాణికులు పిల్లాపాపలు, లగేజీతో ఉరుకులు పరుగులు పెట్టారు. వృద్ధులు పరుగులు తీయలేక ఇబ్బందిపడ్డారు. కొందరు ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి నుంచి వెళ్తే రైలును అందుకోలేమనీ.. ఒకవేళ అందుకున్నా.. సీటు దొరకదనే ఆందోళనతో పట్టాలపై నుంచే ఒక్కో ప్లాట్‌ఫాం దాటుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో కొందరు పడిపోయారు. స్వల్ప గాయాలతోనే రైలును అందుకునేందుకు యాతన పడ్డారు. రైల్వే శాఖ చివరి నిమిషంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. బతుకు జీవుడా అనుకుంటూ రత్నాచల్‌ ఎక్స్‌ప్రెస్‌ను అందుకున్నారు. అధికారుల నిర్ణయంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషయంలో ఇలా ప్లాట్‌ఫాం మార్చడంతో అక్కడికి వెళ్లే ఓపిక లేక.. ప్రయాణాలను కూడా వాయిదా వేసుకున్నామని కొందరు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్‌, విశాఖపట్నం